
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
బుధవారం 20 నవంబరు 2024



నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

ఆమనగల్లు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నేడు(బుధవారం) ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, కోశాధికారి గుజ్జరి నర్సింహ, పీఆర్‌వో ఎంఏ పాషాలు తెలిపారు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్, ఎనుగొండ రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించిన వారికి ఉచితంగా ఐవోఎల్ ఆపరేషన్లు చేయించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ఆమనగల్లు మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలందించాలి

కలెక్టర్ నారాయణరెడ్డి



పారిశుధ్య కార్మికురాలిని సన్మానిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

మహేశ్వరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చిన పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ నారాయణరెడ్డి వైద్యాధికారులకు సూచించారు. మంగళవారం మహేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించి 24 గంటలు వైద్య సేవలు అందించేలా అందుబాటులో ఉండాలన్నారు. విధులకు సక్రమంగా హాజరుకాని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతే కాకుండా రోగులకు అవసరమయ్యే వైద్య పరికరాలు ఉన్నాయా అంటూ వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహేశ్వరం ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పాఠశాలలోని డిజిటల్ టీవీని విద్యార్థులతో ఓపెన్ చేయించారు. పదో తరగతి పరీక్షల్లో 10 జీపీఏ సాధించిన వారికి రూ. 10 వేలు ప్రోత్సాహకంగా ఇస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. అనంతరం సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించిన ఆయన మండల అభివృద్ధి అధికారి శైలజారెడ్డిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. నిర్దేశించిన సమయం వరకు సర్వేను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

పారిశుధ్య పరిస్థితులను మెరుగుపర్చాలి

రంగారెడ్డి అర్బన్: ప్రతీ గ్రామంలో తాగునీరు, పారిశుధ్య పరిస్థితులను మెరుగుపర్చాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. వరల్డ్ టాయిలెట్ డే సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెలా 10వ తేదీ వరకు ప్రతీ గ్రామంలో చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. పాఠశాలల్లో అవసరమున్న చోట మరుగుదొడ్లను మంజూరుకు ప్రతిపాదనలు ఇవ్వాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. వరల్డ్ టాయిటెట్ డే సందర్భంగా పారిశుధ్య కార్మికులు కవిత, జ్యోతి, అండాలు, చెన్నయ్య యాదయ్యలను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీపీవో సురేశ్‌మోహన్ పాల్గొన్నారు.



ధ్రువ పత్రాలు లేకున్నా వెంచర్‌గా మారుతున్న సీలింగ్ భూమి

సీలింగ్ భూమికి ఎసరు!

రూ. 100 కోట్ల విలువైన భూములు స్వాహా!

15 ఎకరాలకు తప్పుడు పత్రాల సృష్టి
ఆక్రమణలకు అడ్డాగా మారిన తుమ్మలూరు
పట్టించుకోని రెవెన్యూ, పంచాయతీ అధికారులు

అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆనుకొని ఉండడంతో పాటు హైదరాబాద్ నగరానికి కూత వేటు దూరంలో ఉన్న మహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామంలో వందల కోట్ల విలువ చేసే సీలింగ్, భూదాన్, ఇనామ్ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. రోజు రోజుకు భూముల ధరలకు రెక్కలు రావడంతో కొందరు రియల్ వ్యాపారులు అందినకాడికి దండుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. మహేశ్వరం నియోజకవర్గానికి భారీ పరిశ్రమలతో పాటు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఫ్యూచర్‌సిటీ వంటి ప్రాజెక్టులు వస్తుండడంతో ఇక్కడి భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.

మహేశ్వరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామంలోని సర్వే నంబర్ 247లో 830 ఎకరాల భూమి ఉంది ఇందులో కొంత ప్రభుత్వ, ప్రైవేటు భూమి ఉంది. ఇందులో దాదాపు 15 ఎకరాల సీలింగ్(మిగులు) భూమికి తప్పుడు ధ్రువ పత్రాలు సృష్టించి అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు. ఎలాంటి పత్రాలు లేకుండా కబ్జాలో ఉన్న వారి నుంచి నయానో, భయానో ఆ భూమిని స్వాధీనం చేసుకుంటున్న కొందరు రియల్ వ్యాపారులు తప్పుడు పత్రాలతో ఆ భూములను వెంచర్లుగా

మిగతా 8వ పేజీలో...



వరి కొయ్యలను కాల్చొద్దు

భూసారానికి సేంద్రియ ఎరువులనే వాడాలి
ఎండ సమయంలోనే పత్తిని సేకరించాలి
జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు

7

ఆమనగల్లు ఏఎంసీ నియామకం



చైర్‌పర్సన్‌గా యాట గీత
వైస్ చైర్మన్‌గా భాస్కర్‌రెడ్డి

6



ప్రమాదకరంగా తక్కళ్లపల్లి బ్రిడ్జి

8

గుంతలుగా మారిన వంతెన
ఆందోళనలో వాహనదారులు
మరమ్మతులకు డిమాండ్



శతచండీ హోమం నిర్వహిస్తున్న భక్తులు

కనుల పండువగా కార్తీక దీపోత్సవం

- మైసిగండిలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు
- ఘనంగా శతచండీ హోమం

కడ్తాల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మైసిగండి మైసమ్మ బ్రహ్మోత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. కార్తీక దీపోత్సవం సందర్భంగా మహలింగార్చన, పుష్పార్చన కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శతచండీ హోమం అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహిస్తున్నారు. మూడు రోజుల హోమం నేపథ్యంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ సిరోలిపంతూ, ఈవో స్నేహలత ల ఆధ్వర్యంలో ఆలయంలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రెండో రోజు హోమంలో ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహాగీత, తహసీల్దార్ ఆర్.పీ జ్యోతిఅరుణ్, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ పద్మశ్రీ, శ్రీనివాస్‌రెడ్డి సునీత దంపతులు కూర్చున్నారు. ప్రముఖ వేద పండితుడు కొడగండ్ల రాధాకృష్ణ శర్మ, కొడగండ్ల వరుణ్ ల ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరక హోమం కొనసాగింది. లోక కల్యాణాన్ని కాంక్షించి హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ సిరోలి పంతూ తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది యాదగిరి, బీచ్యానాయక్, భాను, అమూల్యపతి, విజయ్, వెంకటరమణ, సంతోష్ కుమార్, ఆనంద్, చంద్రయ్య, వెంకటేశ్, శ్రీను, హర్షవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాములు, కృష్ణ, శ్రీనివాస్, పత్యానాయక్, రవీందర్, లక్ష్మమ్మ, ఉమావతి, తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భూ బాధితులకు అండగా ఉంటాం

- భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలి
- బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బూర నర్సయ్యగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

ఇబ్రహీంపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎలిమినేడులో ఏరోస్పేస్ పార్కు కోసం టీజీఐఐసీ భూ బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ అండగా ఉంటుందని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు డా.బూరనర్సయ్యగౌడ్ అన్నారు. మంగళవారం ఎలిమినేడులో బీజేపీ భరోసా కార్యక్రమం పేరుతో బాధిత రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా రైతుల పక్షాన నిర్వాసితుల సంఘం అధ్యక్షుడు బుస్సు శ్రీకాంత్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. ఇక్కడ సర్వే నెం. 166, 420, 492, 512లలో 671.29 ఎకరాలపై 504 మంది పేదలకు అసైన్‌మెంట్ పట్టాలిచ్చారని తెలిపారు. కాగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం టీఎస్‌ఐఐసీ ద్వారా ఏరోస్పేస్ పార్కుకోసం భూసేకరణకు పూనుకుని 571.29 ఎకరాలకు సంబంధించి 481 మంది రైతుల నుంచిభూసేకరణ చేయాలని నిర్ణయించి 2018లో నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. ఎకరాకు రూ.12 లక్షల చొప్పున పరిహారం ప్రకటించి 2019లో భూసేకరణకు ప్రారంభించిందని అందులోనూ కొందరు రైతులు మాత్రమే పరిహారం పొందారని చెప్పారు. అంతేగాక తమకు ఉన్న పట్టా భూమి కంటే తక్కువ విస్తీర్ణం చూపుతూ పరిహారం ఇవ్వజూపుతున్నారంటూ హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. అంతేగాక తమకు ఆర్‌అండ్‌ఆర్‌ప్యాకేజీ ఇవ్వాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయమై బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ భూములు కోల్పోతున్న రైతులకు భూమికి భూమి ఇవ్వాలని లేదంటే 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని బీజేపీ డిమాండ్ చేస్తుందన్నారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కూడా వర్తింజేయాలన్నారు. సమావేశంలో బీజేపీ నాయకలు బోసుపల్లి ప్రతాప్, అర్జున్‌రెడ్డి, లచ్చిరెడ్డి, అంజయ్యయాదవ్, భోజిరెడ్డి, జక్క రవీందర్‌రెడ్డి, శ్రీవలం యాదవ్, శేఖర్‌రెడ్డి, భూనిర్వాసితులు మంచిరెడ్డి రాజేందర్‌రెడ్డి, మంద కుమార్, కొట్టంల మహేందర్, ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి

- ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్



ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ఆమనగల్లు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద తగిన వసతులు ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండ చూడాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సూచించారు. తూకాలను వేగవంతం చేసి రైతులు నిరీక్షించకుండ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు విక్రయానికి తీసుకువచ్చిన ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. గన్నీ బ్యాగులు , తేమ శాతం కొలిచే మిషన్లు, సన్నరకం వడ్ల పరిశీలన యంత్రాలు అందుబాటులో ఉన్నాయా? అని ఏవో శ్రీనివాస్ గౌడ్, ఏఈవో లను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రం నిర్వాహణ తీరుపై రైతులతో మాట్లాడి తెలుసుకున్నారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కేటాయించిన మిల్లులకు తరలించాలని పీఏసీఎస్ సీఈవో దేవేందర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈవోలు నిఖిత, భూదేవి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

చేవెళ్ల డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌నాయుడు
డిగ్రీ కళాశాలలో యాంటీ డ్రగ్స్‌పై అవగాహన

7



రైతులతో మాట్లాడుతున్న ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి

బందోబస్తు నడుమ ఫ్యూచర్‌సిటీ రోడ్డు సర్వే

గాజులబుర్జుతండా, తుర్కగూడలో మోహరించిన పోలీసులు

7

రైతుల నిరసనలతో రెండు రోజులుగా నిలిచిన ఫ్యూచర్ సిటీ రోడ్డు సర్వే పనులు పోలీసుల బందోబస్తు నడుమ మంగళవారం ప్రారంభమయ్యాయి. ఇన్‌చార్జి ఆర్డీవో అనంతరెడ్డి, మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు, పోలీసులు గాజులబుర్జుతండా, తుర్కగూడ గ్రామాల్లో సర్వే చేపట్టారు. అంతకుముందు తుర్కగూడకు బయటి వ్యక్తులను రాకుండా పోలీసులు అడ్డుకున్నారు.
-కందుకూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి)

పల్లె పాలనపై నజర్

నేటి నుంచి గ్రామాల్లో అధికారుల పారిశుధ్య బాట

- వారం రోజుల పాటు స్పెషల్ డ్రైవ్‌కు కలెక్టర్ ఆదేశం
- స్కూళ్లు, ఆసుపత్రులు, హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి
- ఇళ్ల ముందు చెత్తవేస్తే జరిమానాకు ఆదేశాలు



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

పల్లెల్లో పాలనను గాడిలో పెట్టేందుకు కలెక్టర్ నారాయణరెడ్డి చర్యలకు దిగారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆయన ఇటీవల పలు గ్రామాల్లో పర్యటించారు. అనేక చోట్ల పారిశుధ్య అస్తవ్యస్తంగా ఉన్నట్లు గుర్తించిన ఆయన చర్యలకు ఉపక్రమించారు. జిల్లాలోని అన్ని పంచాయతీల్లో పూర్తి స్థాయిలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించేందుకు వారం రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. ఈ మేరకు మండలాల వారీగా షెడ్యూల్ ఖరారు చేసుకోవాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ప్రధానంగా స్కూళ్లు, ఆసుపత్రులు, హాస్టళ్లపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. దీంతో పలు మండల పంచాయతీ అధికారులు ఇప్పటికే షెడ్యూల్ ఖరారు చేశారు. అయితే కొన్ని మండలాలకు

మిగతా 8వ పేజీలో...

కల్లులో మత్తుపదార్థాలను వాడితే కేసులు

చేవెళ్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నిషేధిత మత్తుపదార్థాలను కల్లు తయారీలో వినియోగిస్తే కఠినచర్యలు తప్పవని చేవెళ్ల ఎక్సైజ్ సీఐ శ్రీలత చెప్పారు. మంగళవారం ఖానాపూర్, ఇబ్రహీంపల్లి, అంతారం, గొల్లపల్లి, దామరిగిద్ద, కౌకుంట్ల గ్రామాల్లోని కల్లు దుకాణాల్లో శాంపిల్ సేకరించారు. ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాలకు ముప్పుగా పరిణమించే ఎలాంటి మత్తు పదార్థాలను కల్లుతో కలపొద్దన్నారు. అల్ఫ్రోజోలం, ఎక్కువ మత్తు కల్గించే ఇతర రసాయనాలు కలిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంపిళ్లను ల్యాబ్‌కు పంపుతామన్నారు. తనిఖీల్లో ఎస్సై మొయినుద్దీన్, పోలీసులు పాల్గొన్నారు.


కల్లు దుకాణంలో శాంపిల్ సేకరిస్తున్న ఎక్సైజ్ పోలీసులు


ప్రమాద స్థలం నుంచి చిన్నారులను తీసుకెళ్తున్న తల్లిదండ్రులు

స్తంభాన్ని ఢీకొట్టిన పాఠశాల బస్సు

కీసర రూరల్, నవంబర్ 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను పాఠశాలకు తీసుకెళ్తున్న బస్సు విద్యుత్ స్తంభాన్ని, చెట్టును ఢీకొట్టిన సంఘటన మంగళవారం కీసర మండలంలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. చీర్యాలలోని డివైన్ గ్రేస్ ఇంటర్నేషనల్ స్కూల్ బస్సు 40మంది విద్యార్థులతో దమ్మాయిగూడ మున్సిపాలిటీ కుందన్‌పల్లి నుంచి కుందన్‌పల్లి చౌరస్తా వైపు వస్తోంది. డ్రైవర్ అజాగ్రత్తగా నడపంతో బస్సు రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్థంభాన్ని ఢీకొట్టడంతో అది విరిగింది. అలాగే కొద్దిదూరం వెళ్లి చెట్టును ఢీకొట్టి నిలిపోయింది. దీంతో బస్సు ముందు భాగం ధ్వంసమై పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. వారికి ప్రథమ చికిత్సలు చేసి ఇళ్లకు పంపించారు. సమాచారం అందుకున్న పోలీసులు చేరుకుని బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకున్నారు. కాగా బస్సు ప్రమాదంపై తెలుసుకున్న పలువురు తల్లిదండ్రులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.


చెట్టును ఢీకొట్టిన స్కూల్ బస్సు

ఆమనగల్లు ఏఎంసీ నియామకం

• చైర్ పర్సన్‌గా యాట గీతనర్సింహ, వైస్ చైర్మన్‌గా గూడూరు భాస్కర్‌రెడ్డి • ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

ఆమనగల్లు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా కడ్తాల మండలం మక్తమదారానికి చెందిన యాట గీతనర్సింహ, వైస్‌చైర్మన్‌గా కడ్తాలకు చెందిన గూడూరు భాస్కర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సిఫారసు మేరకు ప్రభుత్వం నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేసింది. ఏఎంసీ డైరెక్టర్లుగా నరేష్‌నాయక్, తాళ్ల రవీందర్, రమేష్‌గౌడ్, పి.జంగయ్య, యాదయ్యగౌడ్, సంపత్‌కుమార్, శ్యాంసుందర్‌రెడ్డి, అజీం, శ్రీశైలం, వెంకట్‌రెడ్డి, రవీందర్, అంజయ్య నియామకమయ్యారు.


జి.భాస్కర్‌రెడ్డి

మండల సాధనకు పోరాటం ఉధృతం

తలకొండపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండల కేంద్రం చేయాలని గ్రామస్థులు చేపట్టిన నిరసనలు హోరెత్తుతున్నాయి. జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 19వ రోజుకు చేరాయి. దీక్షల్లో వివిధ పార్టీల, సంఘాల నాయకులు కూర్చున్నారు. దీక్షలకు మద్దతుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు

బందోబస్తు నడుమ
ఫ్యూచర్‌సిటీ రోడ్డు సర్వే

- గాజులబుర్జు తండా, తుర్కగూడలో మోహరించిన పోలీసులు
- రైతులతో చర్చించిన ఆర్డీవో అనంతరెడ్డి
- రైతుల సమ్మతితో కొనసాగిన సర్వే పనులు



కందుకూరు: రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో అనంతరెడ్డి

కందుకూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతుల నిరసనలతో రెండు రోజులుగా నిలిచిపోయిన ఫ్యూచర్ సిటీ రోడ్డు సర్వే పనులు పోలీసుల బందోబస్తు నడుమ మంగళవారం ప్రారంభమయ్యాయి. ఇన్‌చార్జి ఆర్డీవో(ఇబ్రహీంపట్నం) అనంతరెడ్డి, మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి రెవెన్యూ అధికారులు, పోలీస్ యంత్రాంగం మండలంలోని గాజులబుర్జు తండా, తుర్కగూడ గ్రామాల్లోని సర్వే చేయాల్సిన భూముల వద్దకు వెళ్లారు. అంతకు ముందు తుర్కగూడకు వెళ్లే ప్రధాన రహదారిపై కొత్త వ్యక్తులను గ్రామానికి రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఆర్డీవో అనంతరెడ్డి ఆయా గ్రామాల రైతులతో చర్చించారు. ప్రభుత్వ ఆదేశానుసారం రావిరాల(ఔటర్ రింగ్ రోడ్డు) ఎగ్జిట్ 13 నుంచి మండలంలోని లేమూరు, అగమియాగూడ, తిమ్మాపురం, రాచులూరు, గుమ్మడవెల్లి రెవెన్యూ గ్రామాల గుండా బేగరికంచలో నెలకొల్పనున్న ఫ్యూచర్ సిటీ వరకు 330 ఫీట్ల వెడల్పుతో రోడ్డు వేయడానికి సర్వే పనులు జరుగుతున్నాయని, ఆ పనులను అడ్డుకోవద్దని కోరారు. రైతుల సమ్మతి మేరకే సర్వే పనులను కొనసాగించిన అనంతరం భూములు కోల్పోతున్న రైతులతో వారితో చర్చించి, సర్వే అనంతరం పరిహారం ఇచ్చాకే రోడ్డు నిర్మాణ పనులను కొనసాగిస్తామని రైతులకు అధికారులు వివరించారు.

200 ఫీట్ల వెడల్పు వరకే సేకరించాలి

ప్రభుత్వం నెలకొల్పనున్న ఫ్యూచర్ సిటీతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని., అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదని ఆర్డీవో రైతులకు వివరించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమ భూముల గుండా రోడ్డు కోసం తీసుకుంటున్న భూముల్లో 330 వెడల్పు రోడ్డు నిర్మాణం కాకుండా 200 వందల ఫీట్ల వరకే భూమిని సేకరించాలని అధికారులకు మొరపెట్టుకున్నారు. ఇంతలో స్థానిక నేత వెదిరె రవికాంత్‌రెడ్డి రైతులతో మాట్లాడి వారిని శాంతింపజేశారు. భూములను ఇవ్వకుండా అడ్డుకుంటే రైతులు నష్టపోతారని తెలిపారు. రైతులకు పరిహారంతో పాటు ఆర్థికంగా వనరులు కావాల్సి వస్తే తాను ప్రభుత్వంపై వత్తిడి తీసుకు రావడానికి సిద్ధంగా ఉన్నానని రైతులకు హామీ ఇచ్చారు. అనంతరం సర్వే పనులు కొనసాగాయి. కార్యక్రమంలో తహసీల్దార్ కె.గోపాల్, సీఐ సీతారాం, ఎస్సై పరమేశ్, డివిజన్ సర్వేయర్ క్రిష్ణయ్య, ఆర్ఐ యాదయ్య, మండల సర్వేర్ సాయికాంత్, మరియు ఆయ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉన్న వ్యవసాయ భూమి రోడ్డుకే పోతోంది



నాకు ఉన్న 2ఎకరాల 12గుంటల వ్యవసాయ భూమి ఫ్యూచర్ సిటీ రోడ్డుకే పోతుంది. నాకు ఇద్దకు కుమారులు ఉన్నారు. భూమి పోతే వారు ఎలాబతుకుతారు. ప్రభుత్వం భూమిని తీసుకున్నప్పటికీ మా కుటుంబానికి జీవనాధారం చూపించాలి. లేని పక్షంలో తమ కుటుంబంతో పాటు రోడ్డుకు భూములు కోల్పోయే ప్రతి రైతులకు అన్యాయం జరుగుతుంది. -డి.లక్ష్మమ్మ, రైతు, బేగంపేట

నేడు గాంధీ భవన్‌లో సేవాదల్ శతాబ్ది ఉత్సవాలు



మాట్లాడుతున్న దశరథం

ఆమనగల్లు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి):హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో బుధవారం కాంగ్రెస్ సేవాదళ్ శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సేవాదల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కానుగుల దశరథం తెలిపారు. ఉత్సవాలకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆమనగల్లులో మంగళవారం విలేకరుల సమావేశంలో దశరథం మాట్లాడుతూ.. సేవాదళ్ ఏర్పడి వందేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో వేడుకలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉత్సవాలకు కాంగ్రెస్ సేవాదల్ జాతీయ అధ్యక్షుడు లాల్జీ, రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, పలువురు రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని మండలాల సేవాదళ్ నాయకులు, సభ్యులు హాజరు కావాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చేందుకు సేవాదళ్ సభ్యులు విశేషంగా కృషి చేశారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సేవాదళ్ ప్రజలకు వివరిస్తూ పార్టీ బలోపేతానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సేవాదల్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు లక్ష్మయ్య, ఆరిఫ్, అజీం తదితరులు పాల్గొన్నారు.

పాలేటివ్ కేర్ సెంటర్‌ను సందర్శించిన వైద్యాధికారులు



పాలేటివ్ సెంటర్‌లో డీఎంహెచ్‌వో వెంకటరవణ తదితరులు

వికారాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అనంతగిరిలోని పాలేటివ్ కేర్ సెంటర్‌ను మంగళవారం వైద్యాధికారులు సందర్శించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి వెంకటరవణ, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి నిరోష, ఎన్‌సీడీ సమన్వయకర్త రేణుకుమార్, జయరాం సందర్శించి బయటి రోగులకు, ఇన్ పేషంట్లకు అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ఆలన వాహనం ద్వారా అందించే గృహ సందర్శణలపై వైద్యులు వహాబ్, సుప్రియ, ఫిజియోథెరపిస్ట్‌లను, స్టాఫ్ నర్సులను అడిగి తెలుసుకున్నారు. ఈ కేంద్రం ద్వారా క్యాన్సర్, పక్షవాతం, గుండె సంబంధ వ్యాధులకు చికిత్సలందిస్తామని వివరించారు. అనంతరం రిజిష్టర్లను, రికార్డులను, రిపోర్టులను పరిశీలించారు. సేవలను విస్తృతం చేయాలని సూచించారు.

ఘనంగా అంతర్జాతీయ పురుషుల దినోత్సవం



కేక్ కట్‌చేస్తున్న మండల పరిషత్ అధికారులు, సిబ్బంది

ఆమనగల్లు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి):అంతర్జాతీయ పురుషుల దినోత్సవాన్ని మంగళవారం ఆమనగల్లు మండల పరిషత్‌లో జరుపుకున్నారు. అధికారులు, సిబ్బంది కేక్ కట్‌చేసి ప్రజలకు పంచారు. ఈ సందర్భంగా పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. కుటుంబ, సమాజం, దేశ నిర్మాణం, అభివృద్ధిలో పురుషుల పాత్ర కీలకం అని అధికారులు పేర్కొన్నారు. మహిళా సాధికారిత కోసం వివిధ కార్యక్రమాలు చేపడుతున్న ప్రభుత్వం.. పురుషుల ఆరోగ్యం, పురోగతిపై కూడ శ్రద్ధ వహించాలని అధికారులు అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుసుమమాధురి, ఏపీవో మాధవరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణం చేస్తున్న హరిలాల్, రాంరెడ్డి

వికారాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్.హరిలాల్ (బొంరాస్‌పేట్), ప్రధాన కార్యదర్శిగా కె.రాంరెడ్డి(మమ్మదాన్‌పల్లి), కోశాధికారిగా డి.రాములు(మంతట్టి) ఎన్నికయ్యారు. సోమవారం రాత్రి వికారాబాద్‌లో తెలంగాణ గెజిటెడ్ హెచ్‌ఎంల జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. కార్యక్రమానికి తెలంగాణ గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజభాను చంద్రప్రకాశ్, రాజగంగారెడ్డి అతిథులుగా రాగా ఎన్నికల అధికారి సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఎన్.రాంరెడ్డి వ్యవహరించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన రాంరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సమస్యలు, డిమాండ్ల పరిష్కారానికి, సంఘం పటిష్టతకు కృషి చేస్తానన్నారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ రమేశ్‌నాయుడు

చేవెళ్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని చేవెళ్ల డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌నాయుడు అన్నారు. మంగళవారం చేవెళ్లలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో యాంటీ డ్రగ్స్‌పై అవగాన కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. ఎక్కడైనా డ్రగ్స్ వాడుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, లెక్చరర్లు రమేశ్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి



స్థానికులతో మాట్లాడుతున్న ఏసీపీ రాజు, సీఐ నర్సింహారావు

యాచారం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు ప్రజలు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు కన్పిస్తే 100నంబర్‌కు కాల్ చేసి తెలపాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ.రాజు కోరారు. మంగళవారం యాచారంలో ప్రజలను కలిసి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. రోడ్డు పక్కన చిరు వ్యాపారుల సమస్యలు తెలుసుకున్నారు. వాహనాల్లో సామర్థ్యానికి మించి ప్రయాణించొద్దన్నారు. డ్రైవింగ్ లెసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే ఆర్టీఏ నూతన యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. తనిఖీల్లో సీఐ ఎ.నర్సింహారావు, ఎస్సైలు మధు, సత్యనారాయణ, ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థి రాకేష్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పరిగి/కులకచర్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పరిగిలోని జడ్పీహెచ్ఎస్ నం.01 పాఠశాల 8వ తరగతి విద్యార్థి రాకేష్ అండర్-14 రాష్ట్ర వాలీబాల్ టీంకు ఎంపికయ్యాడు. 18, 19తేదీల్లో మెదక్ జిల్లా చేగుంటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టుకు ఆడి రాష్ట్ర టీంకు ఎంపికయ్యాడు. డిసెంబరు 10, 11, 12తేదీల్లో యూపీలోని వారణాసిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో ఆడతాడు. ఈ సందర్భంగా రాకేష్‌ను మంగళవారం ఎంఈవో గోపాల్, పీడీ ఖాజా, టీచర్లు సన్మానించారు. జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు కులకచర్ల మండలం ముజాహిద్‌పూర్ ఆదర్శ పాఠశాల 9వ తరగతి విద్యార్థి బృహదీశ్వర్ ఎంపికయ్యాడు. చేగుంటలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అతడు ప్రతిభ చూపాడు. జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర టీంకు ప్రాతినిధ్యం వహిస్తాడు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్ జ్యోతి, పీడీ కృష్ణారెడ్డి, టీచర్లు సత్కరించారు.

తహసీల్దార్ కార్యాలయంలో బాహాబాహీ

ఇరు వర్గాలను సముదాయించిన పోలీసులు



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఘర్షణ పడుతున్న ఇరు వర్గాలు

తాండూరు రూరల్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాల, బీఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్ ముక్తార్ నాజ్ మంగళవారం గొడవపడ్డారు. ఇరువర్గాల నాయకులు, అనుచరులు గొడవకు దిగారు. దీంతో తహసీల్దార్ తారాసింగ్ జోక్యం వారితో మాట్లాడినా వినకపోవడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులొచ్చి వారిని సముదాయించారు. కార్యాలయ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. తాండూరుకు చెందిన ముక్తార్ నాజ్ షాదీ ముబారక్ చెక్కుల విషయమై కార్యాలయానికొచ్చారు. ఆర్ఐ గోపి వద్ద కూర్చుని చర్చిస్తున్నారు. అదే సమయంలో హబీబ్‌లాల కూడా వచ్చి ఆర్ఐతో మాట్లాడే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా తమ పనులు సరిగ్గా చేయడం లేదని హబీబ్ ఆర్ఐతో అన్నారు. దీంతో ముక్తార్ నాజ్ ఉద్దేశ్య పూర్వకంగానే అంటున్నాడని వాదనకు దిగాడు. ఇది గమనించిన తహసీల్దార్ తారాసింగ్ ఆర్ఐ రూంలోకెళ్లి ఏమైనా పనిఉంటే తనవద్దకు రావాలని చెప్పారు. తహసీల్దార్ ముందే ఇద్దరూ వాదించుకుంటూ తోసేసుకున్నారు. గొడవ విషయం తెలిసి ఇద్దరి కుటుంబీకులు ఆఫీసుకు చేరుకొని చొక్కాలు పట్టుకోగా గొడవ పెద్దదైంది. తహసీల్దార్ సమాచారంతో పోలీసులు వచ్చి గొడవపడుతున్న వారికి నచ్చజెప్పి పంపించారు. దీనిపై కౌన్సిలర్ ముఖ్తార్ స్పందిస్తూ తమకు గత ఎన్నికల విషయంలో గొడవ జరిగిందని, అది మనసులో పెట్టుకొని ఇప్పుడు ఆర్ఐ వద్ద ఉన్న తనతో గొడవపడ్డాడని అన్నారు. హబీబ్ స్పందిస్తూ.. కాంగ్రెస్ నాయకులు చెబుతున్న పనులు చేయడం లేదని అన్నానే తప్ప తాను ఎవరితోనూ గొడవ పడలేదన్నారు.

రెవెన్యూ కార్యాలయంలో పైరవీల జోరు

తహసీల్దార్ కార్యాలయంలో కొందరు పైరవీల దందా చేస్తున్నారు. కుల, ఆదాయం, ఫ్యామిలీ మెంబర్స్ తదితర సర్టిఫికెట్ల జారీ, సర్వే, పట్టా పాసుపుస్తకం జారీ, రిజిస్ట్రేషన్ పనులకు ఆఫీసు చుట్టూతిరుగుతున్నారు. ఇసుక పర్మిట్లకు కొందరు రాత్రి 8గంటల వరకూ ఆఫీసులో ఉంటున్నారు. జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి పైరవీకారులను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

పోలీసు శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ



గౌరవవందనం స్వీకరిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో ట్రైనీ కానిస్టేబుల్ అభ్యర్థులకు 21న పాసింగ్‌ఔట్ పరేడ్ ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఎస్పీ నారాయణరెడ్డి శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ట్రైనీ కానిస్టేబుళ్ల పరేడ్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ట్రైనింగ్‌లో నేర్చుకునే పరేడ్ సర్వీస్ ఉన్నతం కాలం పనికొస్తుందని, అందుకే శ్రద్ధగా నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీటీసీ ప్రిన్సిపల్ మురళీధర్, డీటీసీ డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐ వెంకట్రాం, ఆర్ఐ డేవిడ్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వరి కొయ్యలను కాల్చొద్దు

చేవెళ్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతులు వరి కొయ్యలకు నిప్పు పెడితే సల్ఫర్ డయాక్సైడ్ విడుదలై వాతావరణం కాలుష్యం ఏర్పడుతుందని జిల్లా వ్యవసాయ అధికారి నరసింహారావు తెలిపారు. మంగళవారం చేవెళ్లలోని రైతు వేదికలో నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో మాట్లాడారు. వరి కొయ్యలను కుళ్లిపోయేలా చేస్తే ఎరువుగా మారుతుందన్నారు. వరి కొయ్యలను కాల్చితే భూమి సారం కోల్పోతుందన్నారు. భూమి సాంద్రతను కాపాడేందుకు సేంద్రియ విధానాలను అవలంబించాలని సూచించారు. చలికాలంలో కురిసే మంచుతో పత్తిలో తేమ పెరుగుతుందని, కాబట్టి ఎండ ఉండే సమయాల్లోనే పత్తి ఏరాలని, సీసీఐ కేంద్రాల్లో పత్తి అమ్ముకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సురేష్‌బాబు, ఏవోలు శంకర్‌లాల్, చైతన్య, ఏఈవోలు రాజేశ్వర్‌రెడ్డి, రమేశ్, శ్వేత, రైతులు పాల్గొన్నారు.

డిసెంబరు 3న జిల్లా బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం



సమావేశమైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

మేడ్చల్ ప్రతినిధి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతులమీదుగా డిసెంబరు 3న జిల్లా బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తామని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తెలిపారు. మంగళవారం జిల్లాలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, వివేకానంద, లక్ష్మారెడ్డిలు కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే వివేకానంద క్యాంప్ కార్యాలయంలో సమావేశమయ్యారు. పార్టీ జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవానికి జిల్లా నలు మూలల నుంచి పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా విభాగం నాయకురాళ్లు, సభ్యులు, యువజన విభాగం, అనుబంధ సంఘాల నాయకులు హాజరుకావాలని వారు కోరారు. ఈ సందర్భంగా కార్యక్రమ ఏర్పాట్లపై వారు చర్చించారు.

రైతులపై కేసులు సరికాదు

కొడంగల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనలో రైతులపై కేసులు పెట్టి వేధించడం సరైంది కాదని ఉమ్మడి పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎం.రాఘవచారి, ముదిరాజు సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎ.సురేశ్, కేఎన్‌పీఎస్ పాలమూరు జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిలర్ వామన్‌కుమార్‌లు అన్నారు. మంగళవారం లగచర్లలో బాధితులతో మాట్లాడారు. కంపెనీలకు భూములివ్వం అని 8 నెలలుగా రైతులు చెబుతున్నారన్నారు. అభిప్రాయ సేకరణకు అధికారులు వెళ్లడం సరికాదని, తనపై దాడే జరగలేదని కలెక్టరే ప్రకటించినా రైతులను అరెస్టు చేయడం అన్యాయమన్నారు. రాజకీయ పార్టీల విధానాలన్నీ ఒకటే అని, ఒక్క పార్టీ కంపెనీలను వ్యతిరేకించడం లేదని విమర్శించారు. ఫార్మా కంపెనీని రద్దుచేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించాలని డిమాండ్ చేశారు.

బలవంతపు భూసేకరణ వద్దు



జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఎం.నాగేశ్వర్

పరిగి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్వార్థ రాజకీయాలకు, ప్రయోజనాలకు ప్రజారోగ్యాన్ని కాపాడే ఫార్మా రంగాన్ని అప్రతిష్టపాలు చేయొద్దని తెలంగాణ జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఎం.నాగేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. లగచర్లలో అధికారులపై దాడి దురదృష్టకరమే అయినా రైతుల మనోభావాలు, సెంటిమెంట్లు కూడా ముఖ్యమేనని తెలిపారు. ఎటువంటి రాజ్యాంగబద్ధ పదవిలేని సీఎం సోదరుడికి అధికారులు రాచమర్యాదలు చేస్తూ అతడితో సమావేశాలు నిర్వహించడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీలకు అవసరాలకు మించి భూసేకరణ సరికాని పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వం ఫార్మా కోసం సేకరించిన భూములను వాడుకోవాలని, మళ్లీ లగచర్లలో భూసేకరణ ఎందుకని ప్రశ్నించారు. ఒక్కో ఫార్మా కంపెనీకి పదెకరాల్లోపే అవసరమని,ఇప్పటికే రాష్ట్రంలో 600 ఫార్మా కంపెనీలున్నాయని పేర్కొన్నారు. ముచ్చర్లలో ప్రభుత్వం 14వేల ఎకరాలు సేకరించిందని, అక్కడే పెడితేనే బాగుంటుందని, లగచర్లలో నిర్బంధ భూసేకరణ దుర్మార్గమని పేర్కొన్నారు.

పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరు కండి

మంత్రి తుమ్మలకు ఎమ్మెల్యే శంకర్ ఆహ్వానం



మంత్రి నాగేశ్వర్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఈ నెలలో నిర్వహించే షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరుకావాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు ఎమ్మెల్యే శంకర్ ఆహ్వానపత్రిక అందజేశారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి పలు అంశాలపై చర్చించారు. షాద్‌నగర్ ఏఎంసీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం ఈ నెల 28, లేదా 29 తేదీల్లో ఉంటుందని, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావాలని మంత్రిని కోరారు.

పౌల్ట్రీ రంగానికి ఆస్తి పన్నును మినహాయించండి

పౌల్ట్రీరంగ నిర్మాణాలకు ఆస్తిపన్నును మినహాయించాలని ఎమ్మెల్యే శంకర్ మంత్రిని కోరారు. రాష్ట్రంలో ఎక్కడా పౌల్ట్రీకి ఆస్తిపన్ను విధించలేదని, ఒక్క షాద్‌నగర్ మున్సిపాలిటీలోనే పౌల్ట్రీకి ఆస్తిపన్ను విధించారని తుమ్మలకు వివరించారు.మున్సిపల్ చట్టంలో పౌల్ట్రీని ఒక యూనిట్‌గా చేసి రూ.100 పన్ను మాత్రమే వసూలు చేయాలని పేర్కొన్నప్పటికీ వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని మంత్రి దృష్టికి తెచ్చారు. మంత్రి స్పందిస్తూ ఈ అంశాన్ని ముఖ్యమంత్రికి తెలిపి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఉద్యమకారులు ఐక్యంగా ఉండాలి



జగన్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

కేశంపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులు ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు పల్లాటి సురేందర్ అన్నారు. కేశంపేటలోని ఓ ఫంక్షన్ హాల్లో మంగళవారం ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ.. ఉద్యమంలో కీలక భూమిక పోషించిన వారంతా కలిసికట్టుగా ఉండాలన్నారు. తమ హక్కుల కోసం పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పోచారం జగన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా చంద్రయ్య, ఉపాధ్యక్షులు యాదగిరి, నసీరుద్దీన్, ప్రధాన కార్యదర్శి నక్క చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శులు శేఖర్, జంగయ్య, కోశాధికారి కందాడ లక్ష్మయ్య, కార్యదర్శులుగా పోలెపోగు మురళి, బోడ జంగయ్య, భాస్కర్, జైపాల్‌రెడ్డి, దశరథంలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో షాద్‌నగర్ తాలుకా అధ్యక్షుడు పి.వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే శాఖలో ఎనిమిదో వేతన కమిషన్‌ను అమలు చేయాలి



మాట్లాడుతున్న నాయకుడు ఖాజాబాబు

ఘట్‌కేసర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైల్వే శాఖలో పెడింగ్‌లో ఉన్న 8వ వేతన కమిషన్‌ను వెంటనే అమలు చేయాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ అధ్యక్షుడు ఖాజా బాబు అన్నారు. మంగళవారం ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ వద్ద కార్మికులతో మాట్లాడారు. రైల్వే శాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేయక కార్మికులపై భారం పడుతోందన్నారు. ఇప్పటికైనా రైల్వే శాఖ పోస్టులను భర్తీచేయాలన్నారు. ట్రాక్‌మెన్‌కు 8గంటల పని విధానాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు. వచ్చే డిసెంబరు 4, 5 తేదీల్లో జరిగే యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో కార్మికులు మజ్దూర్ యూనియన్‌కు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి బొలెపల్లి శ్రీనివాస్, కోశాధికారి ప్రవీణ్ కుమార్, వైస్‌చైర్మన్ వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి హరికృష్ణ, శ్రీనివాస్, అన్నపూర్ణ, అనుమేగ్‌కుమార్, వేణు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలి



మహేశ్వరంలో కరపత్రాలను విడుదల చేస్తున్న కార్మిక నాయకులు

మహేశ్వరం/ఇబ్రహీంపట్నం, నవంబరు19(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం ఆర్టీసీ డిపోలో గుర్తింపు కార్మిక సంఘానికి ఎన్నికలు నిర్వహించాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు అల్వాల రవికుమార్ అన్నారు. ఎన్నికల నిషేధానికి విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని మంగళవారం మహేశ్వరం డిపో వద్ద కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 2019 డిసెంబర్ నుంచి ఆర్టీసీ కార్మిక సంఘాలపై విధించిన ఆంక్షలు ఎత్తేసి, తక్షణమే గుర్తింపు కార్మిక సంఘానికి ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్మికుల ఐక్యత విచ్ఛిన్నానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ ఆర్టీసీలో గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నిక విధానాన్ని రద్దు చేసిందన్నారు. కాంగ్రెస్ పాలకులు ఆర్టీసీ కార్మికులకిచ్చిన ప్రతీ హామినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కవిత, శేఖర్, పలువురు కార్మికులు పాల్గొన్నారు. ఆర్టీసీలో గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించాలని ఇబ్రహీంపట్నం డిపో వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మయ్య మాట్లాడుతూ.. కార్మికుల్లో ఐక్యతను దెబ్బ తీసేందుకు 2019లో ప్రభుత్వం ఆర్టీసీలో ఆంక్షలు విధించిందన్నారు. ధర్నాలో నాయకులు కృష్ణ, ఎల్లేష్, బుగ్గరాములు, చందు నాయక్, సత్యనారాయణ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.


ఎంపీ అరుణకు బొకే అందిస్తున్న మహేశ్

గ్రామాభ్యుద్ధికి నిధులు కేటాయించండి

కేశంపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పోమాల్‌పల్లి అభివృద్ధికి నిధులు కేటాయించాలని మండల బీజేపీ సభ్యత్వ నమోదు కోకన్వీనర్ కుమ్మరి మహేశ్ కోరారు. మంగళవారం ఎంపీ అరుణను హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిసి గ్రామంలో నెలకొన్న సమస్యలు వివరించారు. పాఠశాల భవనం పనులు మధ్యలో ఆగిపోయాయని, ఎంపీ నిధులు కేటాయించాలని కోరారు. ఇందుకు ఎంపీ అరుణ సానుకూలంగా స్పందించారని మహేష్ తెలిపారు.

రాజగోపురం నిర్మాణానికి విరాళం

షాద్‌నగర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివమారుతి గీతా అయప్ప మందిరం రాజగోపుర నిర్మాణానికి దాతలు విరాళం ప్రకటించారు. మంగళవారం పట్టణానికి చెందిన ఆకుల అరుణ-వెంకటేష్ దంపతులు వారి కుమారుడు రాఘవేందర్ జ్ఞాపకార్థం రూ.13లక్షల చెక్కును ఆలయ కమిటీ నిర్వాహకులు నందీశ్వర్‌కు అందజేశారు.

ప్రమాదకరంగా తక్కళ్లపల్లి బ్రిడ్జి

- ఆందోళనలో వాహనదారులు
- మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు


బ్రిడ్జిపై విరిగిపోయిన రెయిలింగ్


తక్కళ్లపల్లి బ్రిడ్జిపై ప్రమాదకరంగా ఉన్న గుంతలు

యాచారం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని హైదరాబాద్-నాగార్జున సాగర్ ప్రధాన రహదారిపై తక్కళ్లపల్లి బ్రిడ్జి ప్రమాదకర పరిస్థితుల్లో ఉంది. బ్రిడ్జిపై పలుచోట్ల గుంతలు పడటంతో వాహనాదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు బ్రిడ్జిపై నుంచి రాకపోకలు సాగిస్తాయి. పలుచోట్ల గుంతలున్నట్లు రోడ్లు భవనాల శాఖ అధికారులకు తెలిసినా పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గుంతల కారణంగా ఏ క్షణం ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియక వాహనాదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వాహనాలు నడుపుతున్నామని చెబుతున్నారు. ఇటీవల ఓ బైక్ అదుపు తప్పి బోల్తా పడడంతో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. బ్రిడ్జికి రెండుపక్కల ఉన్న రెయిలింగ్స్ కూడా పాడైపోయాయి. అధికారులు మరమ్మతులు చేయకపోవడంతో వాహనాలు పల్టీ ప డితే ప్రాణాలు గాలిలో కలవడం ఖాయమని స్థానికులు కలవరపడుతున్నారు. అధికారులు తక్షణమే గుంతలను పూడ్చి రెయిలింగ్ పనులు చే పట్టాలని వాహనాదారులు కోరుతున్నారు.

బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టండి



బ్రిడ్జిపై గుంతలను అధికారులు తక్షణమే పూడ్చాలి. గుంతల కారణంగా బైక్‌లు బోల్తాపడే ప్రమాదముంది. రెయిలింగ్ పాడై ఏళ్లు గడుస్తున్నా అధికారులు మరమ్మతులు చేయడం లేదు. ఆర్‌అండ్‌బీ అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. అధికారులు తక్షణమే బ్రిడ్జికి మరమ్మతులు చేయకపోతే ఆందోళన చేస్తాం.

- పి.శ్రీశైలం, తక్కళ్లపల్లి మాజీ ఉప సర్పంచ్

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



శంకర్‌పల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. మోకిల సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మోకిల పోలీసులు సిబ్బంది ఈనెల 11న ఇంద్రారెడ్డి నగర్‌లో పెట్రోలింగ్ చేస్తుండగా రోడ్డుపక్కన గుర్తుతెలియని సుమారు 35 ఏళ్ల వయస్సున్న వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించారు. చుట్టుపక్కల వారిని విచారించగా ఎవరూ గుర్తుపట్టలేదు. దాంతో అతడిని చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని తెలిపారు. ఈమేరకు చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడు ఏప్రాంతానికి చెందిన వాడో తెలియరాలేదని, అతన్ని ఎవరైనా గుర్తిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. అయితే, అతడు ఆకలితో గానీ, అనారోగ్యంతో గానీ చనిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

పురుగులమందు తాగి వ్యక్తి..

మాడ్గుల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిళ్ల గ్రామానికి చెందిన దోనాల యాదయ్య(48) కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెందిన అతడు మంగళవారం ఇంట్లో పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు హైదరాబద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించినట్లు సీఐ జగదీష్ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వ్యవసాయ పనిముట్ల అపహరణకు యత్నం

- ఇద్దరు నిందితులను పోలీసులకు పట్టించిన రైతులు

చేవెళ్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పంట పొలాల వద్ద వ్యవసాయ పనిముట్లను దొంగిలించిన ఇద్దరు వ్యక్తులను రైతులు పట్టుకొని పోలీస్‌లకు అప్పగించిన ఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని పామెన గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు కథనం మేరకు.. పామెనలో కొంతకాలంగా గుర్తుతెలియని వ్యక్తులు పంటపొలాల వద్ద వ్యవసాయ పనిముట్లతో పాటు స్టార్టర్లు, విద్యుత్ వైర్లు ఎత్తుకెళ్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఇద్దరు వ్యక్తులు పంటపొలాల వెంట తిరుగుతూ వ్యవసాయ పనిముట్లు తీసుకెళ్తుండగా రైతులు గమనించి పట్టుకుని పోలీస్‌లకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకొని పనిముట్లను స్వాధీనం చేసుకున్నారు. రైతుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- ఘనంగా మాజీ ప్రధాని జయంతి


షాద్‌నగర్ : ఇందిరకు నివాళులర్పిస్తున్న శంకర్, తదితరులు

షాద్‌నగర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశానికి అందించిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కొనియాడారు. ఆమె జయంతిని పురస్కరించుకుని మంగళవారం క్యాంపు కార్యాలయంతో పాటు, కేశంపేట చౌరస్తాలోని ఇందిర విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆమె ఆశయాలకు అనుగుణంగానే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తున్నదని వీర్లపల్లి తెలిపారు.

కొత్తూర్ : ఇందిరాగాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు జె.సుదర్శన్‌గౌడ్ ఆధ్వర్యంలో జరుపుకున్నారు. స్థానిక చౌరస్తాలో ఇందిర చిత్రపటాన్ని ఏర్పాటుచేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, నాయకులు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, కర్రొళ్ల సురేందర్, జెనిగె జగన్, ఇందూరు శ్రీనివాస్, జనార్ధన్‌చారి, ఎమ్మె సత్తయ్య, గోవింద్‌నాయక్, తదితరులున్నారు.

కేశంపేట : కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బీస కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ జయంతి వేడుకలు జరుపుకున్నారు. మండల కేంద్రంలో ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, ఓబీసీ సెల్ అధ్యక్షుడు రావుల పెంటయ్య, నాయకులు విజయరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, తుమ్మల గోపాల్, తైద పర్వతాలు, కొట్ట నరేందర్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, తదితరులున్నారు.

మహేశ్వరం : నేటి మహిళలకు దివంగత ఇందిరాగాంధీ ఆదర్శంగా నిలుస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. తుక్కుగూడలోని పార్టీ కార్యాలయంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి నివాళులర్పించారు. సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, కప్పాటి పాండురంగారెడ్డి, కూన యాదయ్య, గోవర్ధన్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, రాకేష్‌గౌడ్, సత్యనారాయణ తదితరులున్నారు.

చేవెళ్ల : అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలకు శ్రీకారం చుట్టిన ఘనత ఇందిరాగాంధీకే దక్కుతుందని ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. చేవెళ్లలోని ఇందిర విగ్రహం వద్ద నాయకులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు ఎమ్మెల్యే పరిశీలించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, పీసీసీ సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బి. రాములు, డైరెక్టర్లు నరేందర్, సత్యనారాయణ, మాజీ సర్పంచ్ మధుసూదన్‌గుప్తా, మాజీ ఉప సర్పంచ్ యాదయ్య, నాయకుడు ఎస్.గోపాల్‌రెడ్డి, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

కడ్తాల్ : ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయమని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్‌లు అన్నారు. మండల కేంద్రంలో ఇందిర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పేదలకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. నాయకులు రాము నాయక్, షాబోద్దీన్, అస్గర్‌అలీ, హీరాసింగ్,జహంగీర్ బాబా, జహంగీర్‌అలీ, మల్లేశ్ గౌడ్, రామకృష్ణ, లక్ష్మణ్ నాయక్, తదితరులున్నారు.

ఆమనగల్లు : ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఆమనగల్లులోని రాజీవ్ చౌక్ వద్ద కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇందిర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ అనితవిజయ్, నాయకులు ఎం.ఏ ఖలీల్, కృష్ణనాయక్, వస్పుల శ్రీశైలం, కానుగుల దశరథం, షాబోద్దీన్, ఖాదర్ ఖాద్రీ, అప్పం శ్రీను, సురేశ్, మహేశ్, శేఖర్ గౌడ్, వస్పుల శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

తలకొండపల్లి : మండల కేంద్రంలో ఇందిరా గాంధీ జయంతి వేడుకలు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుపుకున్నారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మోహన్‌రెడ్డి, రవీందర్ యాదవ్, అజీం, డిగ్రీ కృష్ణ, ఆరిఫ్, రామలింగం, హరిమోహన్‌రెడ్డి, శేఖర్, మల్లేశ్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


చేవెళ్ల : నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, నాయకులు


ఆమనగల్లు : ఇందిర చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బాధిత కుటుంబానికి సబితారెడ్డి పరామర్శ


రాధా-బాలకృష్ణ దంపతులను పరామర్శిస్తున్న సబిత

శంకర్‌పల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి కౌన్సిలర్ పార్శి రాధా బాలకృష్ణ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సబితారెడ్డి పరామర్శించారు. రాధా బాలకృష్ణ ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. కాగా, ఢిల్లీ నుంచి నేరుగా మంగళవారం సబిత శంకర్‌పల్లికి చేరుకున్నారు. కుటుంబికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సబితారెడ్డి రాజేంద్రనగర్ డీసీపీకి ఫోన్ చేసి చోరీ జరిగిన విషయం గురించి మాట్లాడారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్‌రాం రెడ్డి, మాజీ జడ్పీటీసీ నారాయణ. నాయకులు తదితరులున్నారు. అదేవిధంగా చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య రాధ బాలకృష్ణ దంపతులను పరామర్శించారు. దొంగతనం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు.

సీలింగ్ భూమికి ఎసరు!

(5వ పేజీ తరువాయి)

తయారు చేసి కోట్ల రూపాయలు గడిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ కేవైసీ అప్‌డేట్ కాకపోవడంతో తప్పుడు పత్రాలు సృష్టించి రూ.కోట్ల విలువ చేసే సీలింగ్ భూములను ఆక్రమించుకుంటున్నారు కొందరు రియల్టర్లు. తుమ్మలూరు ఒక్కటే కాకుండా మండలంలోని నాగారం, రావిరాల, మంఖాల్ గ్రామ రెవెన్యూ పరిధిలోనూ వందల ఎకరాల ప్రభుత్వ, భూదాన్, ఇనాం భూములతో పాటు చెరువులు, కుంటల భూములను కొందరు రియల్ వ్యాపారులు ఆక్రమించుకొని రూ. కోట్లు గడిస్తున్నారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తప్పవు

తుమ్మలూరులో ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు జరుగుతున్నట్లు మా దృష్టికి రాలేదు. ఒకవేళ అలాంటిది ఏమైనా జరిగితే పత్రాలు లేకుండా వెంచర్ చేయాలనుకుంటే హెచ్ఎండీఏ అధికారులు అనుమతి ఇవ్వరు. సీలింగ్ భూములను కొనుగోలు చేస్తున్నవారు ఎవరైనా ఆ భూములను ఇతరులకు విక్రయించాలనుకుంటే అది తహసీల్దార్ కార్యాలయానికి రావాల్సిందే. తప్పుడు పత్రాలతో కూడిన భూములపై తగిన విచారణ చేపట్టి వారిపై తగిన చర్యలు తీసుకుంటాం.

- సైదులు, తహసీల్దార్ మహేశ్వరం

మెగా కంటి వైద్యశిబిరం విజయవంతం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న సుంకిరెడ్డి వరప్రసాద్ రెడ్డి

ఆమనగల్లు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలోని శ్రీ లక్ష్మీగార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్యశిబిరం విజయవంతమైంది. చెన్నై శంకరన్ నేత్రాలయం సహకారంతో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. ఈనెల 27 వరకు కొనసాగే శిబిరానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుంకిరెడ్డి వరప్రసాద్ రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, వెల్దండ, కల్వకుర్తి, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల నుంచి సుమారు 500 మంది శిబిరానికి హాజరయ్యారు. 350 మందికి పరీక్షలు నిర్వహించారు. దృష్టిలోపం ఉన్నవారికి ఉచితంగా మందులు, కంటి అద్దాలు పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఐవోఎల్ ఆపరేషన్లు చేస్తామని డాక్టర్లు తెలిపారు. సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డిని పలువురు అభినందించారు. మండ్లీ రాములు, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రచ్చ శ్రీరాములు, అభినవ్‌రెడ్డి, మల్లేశ్ నాయక్, కొండల్ యాదవ్, నరేందర్‌గౌడ్, మల్లయ్య చంద్రశేఖర్, రమేశ్‌గౌడ్, రమేశ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి

షాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ సర్పంచ్ శకుంతలా పాండు అన్నారు. మంగళవారం తిమ్మారెడ్డిగూడలో వెల్‌స్పన్ ఫౌండేషన్, షాద్‌నగర్ ఏబీపీ ఆసుపత్రి సహకారంతో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 120 మందికి పైగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వెల్‌స్పన్ ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య, శిరిష, రమేష్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం.. కార్తీక పూజలు

శంషాబాద్ రూరల్/శంషాబాద్/షాద్‌నగర్ అర్బన్/, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండలం నర్కూడలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్, పీఏసీఎస్ చైర్మన్ బుర్కుంట సతీశ్ నివాసంలో మంగళవారం చండీహోమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి హాజరయ్యారు. సల్వేంద్రి వెంకట్‌రెడ్డి, చిరాజేందర్, తదితరులున్నారు. అలాగే శంషాబాద్‌లోని అతి పురాతన శ్రీ లక్ష్మీనరసింహమందిర్ ఆలయంలో భక్తులు కార్తీక ఆకాశదీపం పూజలు నిర్వహించారు. అలాగే కార్తీక మాసం సంకష్టహర చతుర్థిని పురస్కరించుకుని షాద్‌నగర్ గంజ్‌లోని విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. సాయిమిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. మున్సిపల్ చైర్మన్ నరేందర్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు గందే సురేష్ పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. అలాగే షాద్‌నగర్ శ్రీ శివ మారుతి గీతా అయ్యప్ప మందిరంలో నిత్యన్నదాన కార్యక్రమం ప్రారంభమైంది. అయ్యప్పలకు పులిమామిడి గంగాధర్‌గౌడ్, వీరేశం దంపతులు అన్నదానం చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు లష్కర్ అంజనేయులు, గౌరవ అధ్యక్షుడు బసప్ప ప్రధాన కార్యదర్శి నందీశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

చింతపట్లకు బస్సు సౌకర్యం కల్పించండి

యాచారం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చింతపట్లకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ గ్రామస్తులతో పాటు సీపీఎం కార్యకర్తలు డిపో మేనేజర్ వెంకట నర్సింహారావుకు మంగళవారం వినతి పత్రమందించారు. బస్సు సౌకర్యం లేక ఇబ్బందుల పాలవుతున్నామని వారు డీఎంకు వివరించారు. విద్యార్థుల, రైతుల అవసరాలకు తగ్గట్టుగా బస్సు సౌకర్యం కల్పించాలని వారు కోరారు. విచారణ చేసి బస్సు సౌకర్యం కల్పిస్తామని డీఎం హామీ ఇచ్చారు. సీపీఎం నాయకులు జంగయ్య, గిరికాంత్, అచ్చన నర్సింహ, వెంకటయ్య తదితరులున్నారు.

సమస్యలు లేని మున్సిపాలిటీయే లక్ష్యం

ఆదిభట్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తూ సమస్యలు లేని మున్సిపాలిటిగా మార్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. కొంగరకలాన్ 7వ వార్డులో కౌన్సిలర్ నీళ్ల దాసు గౌడ్‌తో కలిసి మంగళవారం రూ.25 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించారు. నాయకులు నీళ్ల శ్రీకాంత్, యాదయ్య, రవిందర్, బాల్‌రాజ్, గణేష్, రమేష్ గ్రామ పెద్దలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులు ఐక్యంగా ఉండాలి

కేశంపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులు ఐక్యంగా ఉండాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు పల్లాటి సురేందర్ అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం కేశంపేట మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పోచారం జగన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా లాలమోని చంద్రయ్య, ఉపాధ్యక్షులుగా యాదగిరి, ఎండీ నసీరోద్దీన్, ప్రధాన కార్యదర్శిగా నక్క చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శులుగా పిప్పళ్ల శేఖర్, మంద జంగయ్య, కోశాధికారిగా కందాడ లక్ష్మయ్య, కార్యదర్శులుగా పోలేపోగు మురళి, బోడ జంగయ్య, భాస్కర్, జైపాల్‌రెడ్డి, దశరథం ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ తాలుకా అధ్యక్షుడు పి. వెంకట్రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

చేవెళ్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం డ్రైవర్ల సంక్షేమం కోసం బోర్డు ఏర్పాటు చేసి ప్రమాద బీమా రూ.25 లక్షలు ఇవ్వాలన్నారు. ప్రైవేటు పాఠశాలలు కార్మిక చట్టాలకు విరుద్ధంగా డ్రైవర్లకు వేతనాలు చెల్లిస్తున్నారని తెలిపారు. అనంతరం చేవెళ్ల నూతన బస్సు డ్రైవర్ల సంఘం యూనియన్ ఏర్పాటు చేశారు. డ్రైవర్లు కిష్టయ్య, వెంకటయ్య, కుమార్, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకోవాలి


చేవెళ్ల : లక్ష్మీబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

షాబాద్/చేవెళ్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): యువత ఝాన్సీలక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకోవాలని ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ కొల్లం సూర్యప్రకాష్ అన్నారు. లక్ష్మీబాయి జయంతిని పురస్కరించుకొని మంగళవారం షాబాద్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వీఆర్ఆర్ మినీ స్టేడియంలో విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఏబీవీపీ నగర అధ్యక్షుడు యాదయ్య, రాష్ట్ర కార్యవర్గసభ్యులు శ్రీకాంత్, నగర కార్యదర్శి మధు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. దేశ స్వాతంత్ర్య సమరంలో వీరోచిత పోరాటం చేసిన వీరవనిత లక్ష్మీబాయి అని ఏబీవీపీ నగర కార్యదర్శులు సూర్యప్రకాశ్, మహిపాల్ తెలిపారు. పట్టణ కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో లక్ష్మీబాయి చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన సేవలందించాలి


కార్యక్రమంలో ఏసీపీ రాజు, నిరంజన్ రెడ్డి

ఆదిభట్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన సేవలందించినప్పుడే పోటీ ప్రపంచంలో నిలబడగలుగుతామని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. ఆదిభట్ల మున్సిపాలిటీ బొంగ్లూర్‌లోని పవన్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ షోరూమ్‌లో మారుతీ సుజుకి సంస్థకు చెందిన న్యూ డాజ్‌లింగ్ డిజైర్ కార్‌ను ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డితో కలిసి మంగళవారం ప్రారంభించారు. కొత్తగా వచ్చిన ఈ మోడల్‌లో 6 ఎయిర్ బ్యాగ్స్ సదుపాయం కలిగి సేఫ్టీలో ఫైవ్ రేటింగ్ కలిగి ఉందని సంస్థ మేనేజర్ నరేష్ వివరించారు. బొంగ్లూర్ మాజీ సర్పంచ్ గణేష్‌గౌడ్, రిషికేష్‌రెడ్డి, శ్రీనివాస్ పవన్ మోటార్స్ సిబ్బంది పాల్గొన్నారు.

(5వ పేజీ తరువాయి)

పల్లె పాలనపై నజర్

చెందిన అధికారులు మేజర్ పంచాయతీల్లో పది రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు అనుమతి తీసుకున్నారు.

పిచ్చి మొక్కల తొలగింపునకు చర్యలు

జిల్లా వ్యాప్తంగా సుమారు 3 వేల పారిశుధ్య సిబ్బంది వారం రోజుల పాటు ఈ డ్రైవ్‌లో పాల్గొనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని అన్ని వీధులు శుభ్రంగా ఊడ్చడంతో పాటు రోడ్లపై, ఖాళీ స్థలాల్లో ఉన్న ప్లాస్టిక్‌ను పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. అలాగే అన్ని ప్రభుత్వ భవనాల్లో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు చర్యలు తీసుకోనున్నారు. ఇందులో భాగంగా బ్లీచింగ్ పౌడర్, ఫినాయిల్ చల్లడం, పిచ్చిమొక్కలు తొలగించడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు. పంచాయతీ కార్యదర్శులు విధిగా గ్రామాల్లో ఇళ్ల నుంచి 100 శాతం తడి, పొడి చెత్తను వేరు చేయించి ట్రాక్టర్ల ద్వారా కంపోస్ట్ యార్డులకు తరలించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. గ్రామాల్లో దోమలు, ఈగలు పెరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా ఖాళీ ప్లాట్లలో పిచ్చిమొక్కలు తొలగించేందుకు సంబంధిత యజమానులకు నోటీసులు ఇచ్చి వారి ద్వారానే శుభ్రం చేయించనున్నారు. అలాగే హరితహారం కింద నాటిన మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోనున్నారు. గ్రామాల్లోని పల్లెపకృతి వనాల్లో వ్యర్థాలను తొలగించనున్నారు. అదేవిధంగా వైకుంఠధామాల్లో మెరుగైన పారిశుధ్య నిర్వహణ చర్యలు చేపట్టనున్నారు.

ఇళ్లముందు చెత్త వేస్తే జరిమానా

ఇళ్ల పరిసరాల్లో అపరిశుభ్ర వాతావరణం వల్ల వచ్చే వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, అలాగే ఇళ్ల ముందు చెత్తవేసి , మురికినీరు రోడ్లపై వదులుతున్నా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో అపరిశుభ్రతకు కారకులైన వారిపై అవసరమైతే జరిమానాలు విధించాలని సూచించారు. గ్రామాల్లో పైపులైన్ లీకేజీలు అరికట్టడంతో పాటు తాగునీటి సరఫరా చేసే వాటర్ ట్యాంకుల్లో విధిగా క్లోరినేషన్ చేయించాలని ఆదేశించారు. పంచాయతీల్లో అన్ని రికార్డులను అప్‌డేట్ చేయించడంతో పాటు స్పెషల్ డ్రైవ్‌లో చేపట్టే పనులకు సంబంధించిన ఫొటోలు తీసి రికార్డు చేయాలన్నారు. స్పెషల్ డ్రైవ్‌కు సంబంధించిన నివేదికలు మండల పంచాయతీ అధికారులకు అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

మహేశ్వరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూమ్‌లను మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య కోరారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కేఎల్లార్‌కు తుక్కుగూడలో వినతిపత్రం అందజేశారు. కందుకూరు, బాలాపూర్, మహేశ్వరం, సరూర్‌నగర్ మండలాల్లో ఇళ్లులేని వారికి మంజూరు చేయాలన్నారు. నాయకులు తదితరులున్నారు.

పారిశుధ్య సిబ్బందికి సన్మానం

ఆమనగల్లు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్రపంచ శౌచాలయ దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు గ్రామ పంచాయతీలకు చెందిన పారిశుధ్య కార్మికులకు ఎంపీడీవో కుసుమ మాధురి సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఏపీవో మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సంక్షిప్తంగా..

- **షాద్‌నగర్ అర్బన్** : షాద్‌నగర్ తిరుమల బిన్నీరైస్ మిల్ యజమాని, ఇప్పలపల్లికి చెందిన జి. శేఖర్‌రెడ్డి(84) అనారోగ్యంతో మంగళవారం మరణించారు. పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులు, నాయకులు, పట్టణ ప్రముఖులు నివాళులర్పించారు. షాద్‌నగర్‌లో అంత్యక్రియలు జరిగాయి. ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, ప్రతాప్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, విశ్వం, బీజేపీ నాయకులు అందె బాబయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నటరాజ్, శ్రీధర్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు.
- **చేవెళ్ల** : చేవెళ్ల గ్రామానికి చెందిన యువకుడు అవుసుల ప్రవీణ్‌చారి తన పుట్టినరోజు సందర్భంగా సొంత డబ్బుతో హైదరాబాద్-బీజాపూర్ హైవేపై గుంతలు ఉండగా.. చేవెళ్ల నుంచి మీర్జాగూడ వరకు రీటీటీ కాంక్రీటుతో పూడ్చివేయించారు. ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ప్రజాప్రతినిధులు ఆయన్ను అభినందించారు.
- **తలకొండపల్లి** : వెల్జాల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఏవో రేణుక చక్రవర్తిని సందర్శించారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు.
- **యాచారం** : ప్రతీ ఇంటికి, పాఠశాలలో మరుగుదొడ్డి నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి చెప్పారు, హమారా సౌచాలయ్, హమారా సమ్మాన్‌లో భాగంగా నజ్దిక్‌సింగారం ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్డి నిర్మాణం చేపట్టారు. ఏపీవో లింగయ్య, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ శివశంకర్‌రెడ్డి, హెచ్ఎం లావణ్యలున్నారు.
- **తలకొండపల్లి** : మండల కేంద్రంతో పాటు యెడవెల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో మహిళా శక్తి వారోత్సవాలు నిర్వహించారు. మహిళా సంఘాల్లో చేరిన సభ్యులకు బొట్టు పెట్టి సంఘం వ్యక్తిగత పాస్‌బుక్ లను అందజేశారు. సీసీ రాములు, ఏపీఎం శ్రీదేవి సభ్యులున్నారు.
- **ఆమనగల్లు** : అర్హులైన నిరుపేదలందరికీ ప్రభుత్వ వర్తింపజేసి ఆదుకోవాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వంకేశ్వరం రమేశ్ కోరారు. విద్య, వైద్యం, ఉపాధి, సాగు భూమి, ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ తహసీల్దార్ లలితకు వినతిపత్రం అందజేశారు.
- **తలకొండపల్లి** : గట్టిప్పలపల్లిలో ప్రాథమిక సహకార సంఘం ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జయమ్మ వెంకటయ్యలు కోరారు. నూతనంగా ఏర్పాటుచేసే పీఏసీఎస్‌లలో గట్టిప్పలపల్లిని చేర్చాలని డిమాండ్ చేశారు. గట్టిప్పలపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చంద్రశేఖర్‌రెడ్డి, జయమ్మవెంకటయ్యలు మాట్లాడారు. బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజు, డైరెక్టర్ శిరీష కృష్ణయ్య, పాల్గొన్నారు.